క్లుప్తంగా

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం : మండలంలోని చెముడుగుంట పంచాయతీ కుంకుమపూడి గ్రామానికి చెందిన వివాహిత కూని స్వప్న అదృశ్యంపై భర్త ప్రవీణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల రెండో తేదీన ప్రవీణ్ పనినిమిత్తం బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి చేరుకోగా భార్య ఇంట్లో కనిపించలేదు. గ్రామంతో పాటు బంధువుల గ్రామాలకు వెళ్లి విచారించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య అదృశ్యంపై గ్రామానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి ప్రమేయం ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి అమ్మవారి ఆలయం వద్ద పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైంది. ఈ ఘటనపై బుధవారం బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. సంగం గ్రామానికి చెందిన ఈర్ల శివశంకర్ అనే యువకుడు అమ్మవారి దర్శన నిమిత్తం ఈనెల 5న తన పల్సర్ బైక్‌పై వచ్చాడు. ఆలయం వెనుక భాగాన బైక్‌ను పార్కు చేసి అమ్మవారి దర్శనానికి వెళ్లాడు. దర్శనం ముగించుకుని తిరిగి వచ్చేసరికి బైక్ లేకపోవడంతో గాలింపు చేపట్టాడు. అయితే బైక్ ఆచూకీ తెలియకపోవడంతో తమకు ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్) : రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు నగర పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. పసుపు పచ్చరంగు హాఫ్ హ్యాండ్స్ టీషర్టు, గ్రేరంగు జీన్స్ ప్యాంట్ ధరించిన సుమారు 30 నుంచి 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి వేదాయపాళెం-నెల్లూరు రైల్వేస్టేషన్‌ల మధ్య కావలి వైపు వెళ్లే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుడిచేతిపై యువన్ అని ఇంగ్లిష్‌లో, ఎడమచేతి మీద కేఎంబీ, తల్లీబిడ్డ బొమ్మ పచ్చబొట్లుగా ఉన్నాయి. మృతుడి వివరాలు తెలియరాలేదు. దీంతో మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్‌ఫామ్‌పై అనారోగ్యంతో..

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై సుమారు 65 నుంచి 70 ఏళ్ల కలిగిన గుర్తుతెలియని వృద్ధుడు బుధవారం అనారోగ్యంతో మరణించాడు. మృతుడు తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, తెలుపు, పచ్చ రంగు కలిగిన లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుల వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

కసుమూరులో వ్యక్తి హల్‌చల్

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో మతి స్థిమితంలేని వ్యక్తి గత రెండు రోజుల నుంచి హల్‌చల్ చేస్తున్నాడు. స్థానికులు, ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తున్నాడు. కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు సమీపంలోని దుకాణాల వద్ద మంగళవారం సాయంత్రం మతిస్థిమితం లేని వ్యక్తి పెద్దగా కేకలు వేస్తూ ప్రయాణికులను భయపెట్టాడు. దర్గాకు వచ్చిన ఓ భక్తుడి సెల్‌ఫోన్‌ను లాక్కోవడంతో స్థానికులు చుట్టుముట్టి తీసుకున్నారు. అనంతరం అతన్ని చెరువు కట్టపైకి తీసుకెళ్లి వదిలారు. అయితే బుధవారం సాయంత్రం కూడా ఆ వ్యక్తి దుకాణాల వద్దకు వచ్చి హల్‌చల్ చేయడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద బుధవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన నిజాముద్దీన్ పనినిమిత్తం బైక్‌పై కసుమూరు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో నిజాముద్దీన్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్‌షెల్టర్లో వ్యక్తి మృతి

పొదలకూరు : పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ బస్‌షెల్టర్లో ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..కలువాయి మండలం వెదనపర్తి గ్రామానికి చెందిన కొట్టా తిరుపాల్(40) బస్టాండ్లోని బస్‌షెల్టర్లో పడుకున్నాడు. అక్కడే మరణించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు అతిగా మద్యం సేవించి గొంతెండిపోయి మృతి చెందాడా? లేక మరేదైనా కారణమా అనే దానిపై ఎస్సై కరిముల్లా విచారణ చేపట్టారు. తిరుపాల్ బంధువులకు సమాచారం అందించి వారు వచ్చిన తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తామని ఎస్సై తెలిపారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

దుత్తలూరు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. దుత్తలూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. దుత్తలూరు సెంటర్‌లో ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

కలిగిరి: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాలకృష్ణుడు, గోపికలుగా అలంకరించి మురిసిపోయారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు సందడి చేశారు.

ఉదయగిరి(వింజమూరు): వింజమూరు మండలంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సంప్రదాయం ప్రకారం అష్టమి తిథులు బుధవారం రాత్రి నుంచి వస్తుండడంతో ఎక్కువ మంది గురువారం కృష్ణాష్టమి వేడుకలు జరుపుకొనేందుకు మొగ్గుచూపారు. కాగా ప్రభుత్వ సెలవుదినం కావడంతో ఉద్యోగుల కుటుంబాలు కూడా బుధవారమే కృష్ణాష్టమి వేడుకలను జరుపుకొన్నాయి.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో కోలాటాన్ని ప్రదర్శించి ఉట్టికొట్టారు. చిన్నికృష్ణుని లీలలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

కావలి: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుడికి విశేష పూజలు నిర్వహించారు. కృష్ణతత్వాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం కోలాట ప్రదర్శన, ఉట్టి మహోత్సవం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు.



దుత్తలూరులోని ఓ పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



దుత్తలూరులో విశేషాలంకారంలో వేణుగోపాలస్వామి



చిన్నికృష్ణుడి వేషధారణలో చిన్నారి



కావలిలో ఉట్టికొడుతున్న చిన్నారులు



కలిగిరిలో..



వింజమూరులో..

దారంతో శ్రీకృష్ణుడి కళాకృతి



మర్రిపాడు మండలం చుంచులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మున్నెళ్లి శివశంకరయ్య పలుచటి వస్త్రంపై దారంతో శ్రీకృష్ణుడి కళాకృతిని రూపొందించారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని తన కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు.

–ఆత్మకూరురూరల్(మర్రిపాడు)

బీమా సౌకర్యంపై అవగాహన

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని గృహసారథులకు బీమా సౌకర్యంపై జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి బుధవారం అవగాహన కల్పించారు. కొత్తపల్లి, రేవూరు, మినగల్లు, ఆమని చిరువెళ్ల, తదితర గ్రామాల్లోని గృహసారథులను కలుసుకుని వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్న బీమా సౌకర్యంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఆయన వెంట మధు, తదితరులు ఉన్నారు.

ఐక్యతా విజయపథం ర్యాలీ

కావలి: రాష్ట్రంలోని పేదల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి అభ్యున్నతికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి జీఎస్సార్‌కేఆర్ విజయకుమార్ 'ఐక్యతా విజయపథం' పేరుతో చేపడుతున్న యాత్ర బుధవారం కావలికి చేరుకుంది. తొలుత ఆయన వివిధ సంఘాల నాయకులతో కలిసి స్థానిక జెండాచెట్టు సెంటర్ నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు జీవోపాధి కల్పించి, వారి జీవన ప్రమాణాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఐక్యతా విజయపథం యాత్ర నిర్వహిస్తున్నానని తెలిపారు.



కావలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విజయకుమార్

ఏఎస్‌పేట దర్గాను దర్శించుకున్న విదేశీయులు

అనుమసముద్రంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేట దర్గాను విదేశీయులు బుధవారం దర్శించుకున్నారు. బెల్జియానికి చెందిన యువకుడు, జర్మనీకి చెందిన యువతి దర్గాను దర్శించుకుని హజరత్ ఖాజానాయబ్ రసూల్, దొరసానమ్మకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా విశిష్టతను తమ మిత్రుల ద్వారా తెలుసుకుని సందర్శించినట్లు వారు తెలిపారు.



ఓట్ల తొలగింపుపై విచారణ



ఉదయగిరిలో తొలగించిన ఓట్లపై విచారణ చేస్తున్న ప్రత్యేకాధికారి సుధాకర్‌రావు



కలిగిరిలో క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్న ప్రత్యేకాధికారి సుధాకర్‌రావు

ఉదయగిరి: పట్టణంలో ఓటరు జాబితా సర్వేలో భాగంగా తొలగించిన ఓట్లపై ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి ఎంవీ సుధాకర్‌రావు బుధవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పట్టణంలోని రోజ్‌గార్‌వీధి, యూనియన్ రోడ్డు, శివాలయంవీధి, తదితర ప్రాంతాల్లో తొలగించిన డబుల్ ఎంట్రీలు, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓట్లపై వాస్తవ పరిస్థితులను కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారిని అడిగి తెలుసుకున్నారు. బీఎల్వోలు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని సూచించారు.

వరికుంటపాడు: మండలంలోని వరికుంటపాడు పంచాయతీ కనియంపాడులో ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి ఎంవీ సుధాకర్‌రావు ఓట్ల పరిశీలన చేశారు. ఓటరు జాబితా సర్వేలో భాగంగా తొలగించిన ఓట్లపై క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, సర్పంచ్ దిలీప్‌కుమార్ ఉన్నారు.

కలిగిరి: స్థానిక కొత్తూరులో ఓటరు జాబితా సర్వేలో భాగంగా తొలగించిన ఓట్లపై ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి ఎంవీ సుధాకర్‌రావు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 435 ఓట్లను తొలగించినట్లు తెలిపారు. అందులో 365 డబుల్ ఎంట్రీలు, 54 మరణించిన, 16 వలస వెళ్లిన వారి ఓట్లు ఉన్నాయని వివరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దుత్తలూరు: ఓటరు జాబితా సర్వేలో భాగంగా తొలగించిన ఓట్లపై మండలంలో లక్ష్మీపురంలో ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి సుధాకర్‌రావు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఆర్‌ఐ అర్షద్ అహ్మద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత



రైతులతో మాట్లాడుతున్న ట్రాక్టర్ డ్రైవర్లు



రైతులు అడ్డుకోవడంతో నిలిచిన ఇసుక ట్రాక్టర్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని తిరునాళ్లతిప్ప మార్గంలో బొగ్గేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను రైతులు బుధవారం సాయంత్రం అడ్డుకున్నారు. గత కొద్దిరోజులుగా సుమారు 20కుపైగా ట్రాక్టర్లు బొగ్గేరు నుంచి ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నాయి. దీంతో రైతులు పొలాల్లో వెళ్లే మార్గం తీవ్రంగా దెబ్బతింది. దీనికితోడు బొగ్గేరులో నిర్మించిన నూతన రైల్వే ట్రాక్ పిల్లర్లు సమీపంలోనూ ఇసుక తవ్వడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో భవిష్యత్తులో తీవ్ర ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానిక రైతులు మండిపడుతూ ఇసుక ట్రాక్టర్లను బొగ్గేరులోనే అడ్డుకున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకపోతే కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

సంగం : మండల కేంద్రమైన సంగంలోని సచివాలయం-3 పరిధిలో గురు, శుక్రవారాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. గురువారం సాయంత్రం సంగంలో రూ.9.80 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ, గ్రావెల్ రోడ్డును ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కావలి: పట్టణంలోని 33వ వార్డులో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 8 గంటలకు కళుగోళమ్మపేటలోని అయ్యప్పస్వామి మందిరం వద్ద నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారని చెప్పారు. పట్టణంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

ఉదయగిరి: నియోజకవర్గంలోని కలిగిరి ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అనిల్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఆయన విజయవాడలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన ఉదయగిరి ప్రాంతానికి ఎంతో కొంత మేలు చేయాలనే కోరికతో రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకుడు కోటంరెడ్డి విజయకుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉత్తమ అధ్యాపకులు, ఉపాధ్యాయులకు సన్మానం



ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు సత్కారం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ఆత్మకూరు: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్తమ అధ్యాపకులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న అధ్యాపకులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఏ కిషోర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మున్సిపల్ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఎం వెంకటేశ్వర్లు, సోమిశెట్టి కిరణ్‌కుమార్, ఎన్ సంతోష్‌కుమార్, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ గణపతికి విశేష పూజలు



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని మర్రిపాడు మండలం డీసీపల్లిలోని పంచముఖ శక్తి గణపతి ఆలయంలో బుధవారం స్వామి వారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు నంద్యాల కేశవరెడ్డి, రమాదేవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఉదయగిరి జిల్లా సాధనకు సమష్టి పోరాటం



ఉదయగిరి: ఉదయగిరి జిల్లా సాధనకు ప్రజలు సమష్టిగా పోరాడాలని ఉదయగిరి జిల్లా సాధన సమితి అధ్యక్షుడు వేణుగోపాల్ పిలుపునిచ్చారు. మండలంలోని దాసరిపల్లిలో ఉదయగిరి జిల్లా సాధనపై మంగళవారం రాత్రి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన జిల్లాగా ఏర్పాటైతే వెనుకబడిన ఉదయగిరి ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెంది ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉదయగిరి జిల్లాకు మద్దతు తెలిపే పార్టీలకే మన మద్దతు తెలుపుదామన్నారు. కొత్త జిల్లా సాధనకు ప్రజల మద్దతు ఎంతో అవసరమన్నారు. ఉద్యమ నేతలు దస్తగిరి అహ్మద్, ఖాదర్‌బాషా, సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొయిద్దీన్, ఎంపీటీసీ సుభానీ, నేతలు ఓబులరెడ్డి, జాఫర్‌మొయిద్దీన్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలోని రైతులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలోని భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం ద్వారా భూముల రీ సర్వేకు శ్రీకారం చుట్టారు. సీఎం వైఎస్ జగన్ లక్ష్యానికి అనుగుణంగా ఎమ్మెల్యే మేకపాటి రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన సమయంలోనూ 60 శాతం రెవెన్యూ సమస్యలపైనే విజ్ఞప్తులు రావడంతో వాటి పరిష్కారానికి తనదైన కార్యాచరణ చేపట్టారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రతి సచివాలయం పరిధిలో వీఆర్వో, వలంటీర్లను భాగస్వాములను చేసి రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి మండలస్థాయిలో రెవెన్యూ సమన్వయ కమిటీ సభ్యులను నియమించారు. వీరు ప్రతి నెలా పదిహేనురోజులకు ఒకసారి గ్రామాల్లో పర్యటించి రెవెన్యూ సమస్యలపై వినతులు స్వీకరించి మండల, డివిజన్ స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. వారి పరిధి మించితే ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చొరవతో ఆత్మకూరు నియోజకవర్గంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీక్ష సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే తొలి దఫా నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో పాటు కలెక్టర్ హరి నారాయణన్, మండల తహసీల్దార్లు పాల్గొని చాలా వరకు సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు. ఈ నెల 8న రెండో దఫా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆర్డీఓ, తహసీల్దార్లు, రెవెన్యూ సమన్వయ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. కాగా రెండో దఫా సమీక్ష సమావేశంలోగా ప్రజలు తమ రెవెన్యూ సమస్యలను మండల రెవెన్యూ సమన్వయ కమిటీ సభ్యులు లేదా నెల్లూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రత్యేకంగా నియమించిన విశ్రాంత తహసీల్దార్ రామలింగేశ్వరరావు దృష్టికి కానీ తీసుకురావాలని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు కోరారు.



రెవెన్యూ సమస్యలపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి (ఫైల్)

రెవెన్యూ సమన్వయ కమిటీ సభ్యులు

మండలం	పేరు	సెల్ నంబర్
మర్రిపాడు	గంగవరపు శ్రీనివాసులనాయుడు	94935 22344
అనంతసాగరం	రాపూరు వెంకట సుబ్బారెడ్డి	98801 16171
ఆత్మకూరురూరల్	గడ్డం శ్రీనివాసులరెడ్డి	90102 88008
ఆత్మకూరుటౌన్	నాగులపాటి ప్రతాప్ రెడ్డి	94409 25556
ఏఎస్‌పేట	అంబవరపు కోటిరెడ్డి	94407 50088
సంగం	గుండాల చంద్రారెడ్డి	94404 81807
చేజర్ల	పోలంరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి	63013 91210